ప్రసాదం

"నీకేం ఫర్వాలేదు. ఈ వూర్లో నీకు దివ్యంగా వుంటుందిరా! మీ వూరుకంటే చాలా నయం అనుకో! ప్రతీ వస్తువా అందుబాటులో దొరుకుతుంది! మా ఏరియా చూశావ్‌గదూ? ఎలావుంది?"

వాళ్ళ యింటికి వెళుతూనే, మావయ్య మాటలతో వూపిరిసలపనీయలేదు చిదంబరానికి తనతో తీసుకువచ్చిన ఎయిరిండియా బ్యాగు నింకా చేతిలోంచీ దించలేదు! మావయ్య వాక్ప్రవాహంలో పడిపోయి, చిదంబరం చేష్టలుదక్కి అలా నిలబడివుండిపోయాడు.

నిజమే! జనార్ధనం మావయ్య యిల్లు చాలా బావుంది! విశాలమైన గదులు నాలుగయిదున్నయ్! అన్నిటికీ పెద్దపెద్ద కిటికీలూ, వాట్లోంచీ ధారాళంగా గాలీ, వెలుతురూ వస్తున్నయ్! మొజాయిక్ నేలా, డిస్టెంపరేసిన గోడలూ, అధునికమైన ఫర్నిచరూ, అప్‌టుడేటు వంటగదీ.... మెట్లు ఎక్కి పైకివెళ్ళాడు చిదంబరం. మేడమీద ఒక పెద్ద గదివున్నదంతే! సౌకర్యాలన్నీ ఆ గదికి వున్నయ్! కాని తలుపులువేసి, గడియ బిగించివున్నది ఆగది! తలుపుతీసి లోనికెళ్ళిచూసి నిట్టూర్చాడు చిదంబరం.

"మావయ్యా! యింతగదిని ఎందుకు నువ్వు యిట్లా ఖాళీగా వుంచేశావో గానీ, యిదే మా వూరిలో అయితే ఓ నూట ఎనభయ్ రూపాయలేనా రాబడ్తాలి గదిమీద! మరి నువ్వేందు కిలా వుంచేసావో?" అన్నాడు చిదంబరం.

"నా కెవరికీ అద్దెలకివ్వడం యిష్టంలేదురా! నేను మొదట్నించీ యిల్లు కట్టినదగ్గర్నించీ అలాగే అనుకున్నాను! అలాగే చేస్తున్నాను యిదిగో! ఎవరయినా మనవాళ్ళంటూ వుంటే నా కెంతో తృప్తీ, సంతోషమూను! నువ్వయితే ఒంటిగాడివి! నీకు మరోళ్ళ పోరులేదు! ఒక్కడివీ ఆ గదిలో చక్కగా రాసుకుంటూ వుండొచ్చు!! చదువుకో! నిద్రపో! నీయిష్టం! ఆ గదిని నీ కిచ్చేశానంతే! నా నిర్ణయానికి మాఆవిడా, పిల్లలు ఏమీ అభ్యంతరం చెప్పర్రా!! వాళ్ళసంగతి నీకుమాత్రం తేలీదూ?"

తెలుసునన్నట్టు బుర్ర వూపేడు చిదంబరం.

అతను వెళ్ళేసరికి యిల్లంతా నిశ్శబ్దంగానే వున్నది! అత్తయ్య దక్షిణదేశ యాత్రలకి టూరిస్టు బస్సుమీద ఒక బృందంతో వెళ్ళిందని మావయ్య చెప్పాడు. ఇద్దరాడపిల్లల్లో పెద్దపిల్ల మృణాళినికి నాలుగేళ్ళక్రితమే వివాహం అయ్యి, భర్తతో అతను ఉద్యోగం చేస్తున్న బొంబాయి వెళ్ళిపోయింది. ఏడాది కొక నాల్రోజులే అరుదుగా యింటికి వస్తుందిట! రెండోపిల్ల వింధ్య పెద్దచదువులు చదివి, మధ్యప్రదేశ్‌లో ఏదోవూర్లో మంచి జాబ్ చేస్తోందిట! "అది ఎందుకోగానీ పెళ్ళిచేసుకోననేసింది! సరే! ఏంచేస్తాం? దానిబ్రతుకునీ, భవిష్యత్‌నీ దానిఖర్మానికి విడిచిపెట్టేసేము" అన్నాడు మావయ్య.

"అయితే, క్రింద యింత యిల్లూ యిట్లా మీ యిద్దరే వుంటున్నారా? యిన్నిగదులు, యిన్ని సౌకర్యాలు?" వాపోయాడు చిదంబరం.

"ఆహా అత్తయ్యా, నేనే వుంటున్నాం! నే నసలు నెలలో ఏ వారం పదిరోజులో యింటిదగ్గర వుంటానేమో నా వ్యవహారాల్నికు తెలుసుగదూ?" నవ్వాడు మావయ్య.

"జనార్ధనం మావయ్య వుద్యోగం ఎప్పుడూ చేయలేదు! ఎం. కాం. ఫస్టుక్లాస్ అయినాక, రాజకీయాల్లో దిగాడతను! గాంధీగారి కాలంలో మావయ్య వుద్యమాలుతో వూపిరాడకుండా తిరిగాడు. జైలుకెళ్ళాడు. లాఠీదెబ్బలుతిన్నాడు చాలాచాలా హీరోగారి కార్యాలు నెరవేర్చాడు.

ప్రస్తుతం అతని వయసు అరవయ్యయిదు! అయినా బ్రహ్మాండమైన పర్సనాల్టీ!! మంచి పుష్టిగలఒళ్ళు! ఒక్కపూటే రోజుకి తిన్నా శుభ్రంగా తినగలచేవవుంది! అది తనకేలేదు అని చింతించాడు చిదంబరం.

ఆ వూరికి అంతకుమునుపు ఒక్కమారే వచ్చాడు చిదంబరం. అదీ ఆరు సంవత్సరాలక్రితం. చుట్టం చూపుగా వచ్చి. యిరవయిరోజులుండీ వెళ్ళిపోయాడు.

జనార్ధనం మావయ్యకి వుద్యోగం లేదుగదా? భార్యనీ సంసారాన్నీ ఎట్లా పోషిస్తున్నాడని చిన్నతనంలో అనుకునేవాడు చిదంబరం. అత్తయ్య – మావయ్య పెళ్ళినాటికే బ్యాంకులో వుద్యోగం చేస్తున్నదని తెల్సింది! వాళ్ళిద్దరికీ సామరస్యం వున్నదిగనుక సర్దుకుపోతున్నారు! యిల్లు ఆవిడే కట్టించింది! మావయ్యకి పలుకుబడిబాగా వున్నది ఆ వూరిలో, చుట్టూ వూళ్ళలో! ఎవరో వస్తారు యింటికి! రాజధానికి వెళ్ళి వాళ్ళపనులు సానుకూలం అయినట్లు చూడమని కోరుతారు! మావయ్య వెళతాడు! వాళ్ళపన్లు అవుతాయ్! మావయ్యకి దారిఖర్చులూ, భోజనం, బసా, ఇతరత్రా ప్రతిఫలమూ లభిస్తుంది! అతను తన జేబులోంచీ తీసీ ఒకరికీయడమేగానీ, భార్య నించి ఏ రోజూ రూపాయి పుచ్చుకోలేదు! తనే ఆవిడకి చీరలూ, చేప్పులవీ కొనేవాడు! పిల్లలికి కొనేవాడు. ఆనాటికీనాటికీ మావయ్య జెండా అలా ఎగురుతూనేవున్నది!

ఆమధ్య స్వాతంత్ర సమరయోధులనీ, రాజకీయ బాధితులనీ యిలాగ అనేకమందికి పెన్షన్లు ప్రభుత్వంనించీ లభించసాగాయి. మావయ్యకి అప్పటినించీ నెలకి వెయ్యికి తక్కువలేకుండా పెన్షను వస్తోందలాగ!

చిదంబరం స్నానంచేసి ఫ్రెష్‌గ అయ్యాడు. వంట



మావయ్యి బ్రహ్మాండంగ చేశాడు. సాయంత్రం చిదంబరం అలా బయటకి నడిచాడు ఒక్కడూ మావయ్యి మధ్యాన్నమే ఎటో వెళ్ళిపోయాడు తిరిగి రాత్రి పదికే రావడం!

చిదంబరం బయటకెళ్ళి నిమషం అలా నించుండి పోయాడు.

మావయ్యి మేడప్రక్కనే ఒక చిన్న గుడి వున్నది! చిదంబరానికి గుడి అంటే చాలాయిష్టం! ఎక్కడా దొరకని ప్రశాంతత గుడిలో మనిషికి దొరుకుతుందని అతని అభిప్రాయం. నమ్మకం ఆ గుడిలోకి అంతకుముందుపతను ఒక పదిహేనుమార్లయినా వెళ్ళాడు. ముందర నంది విగ్రహం! వెనుకన శివలింగం, పానవట్టం! నిశ్శబ్దంగా వున్నది అక్కడ. పూజారి చెన్నకేశవులెక్కడా కన్పించలేదు! బహుశా బయటికే కూరానారా తెచ్చుకొందికి వెళ్ళివుంటాడనుకున్నాడు చిదంబరం.

చెన్నకేశవులు ఒక్కడే వుంటున్నాడా గుళ్ళో. గుడిలోనే ఒక గది వేరేగ వున్నది. అందులో చెన్నకేశవులు ఒకవార తనకోసం వంట చేసుకుతిని, పడుకుంటాడు. భక్తులు యిచ్చే దక్షిణ తాంబూలాలు. యితరత్రా వ్రతాలకీ, పూజలకీ వాటికీ లభించేదీ చెన్నకేశవులికి రాబడి! దాంతో అతని జీవనం గడిచిపోతున్నది!

గతమారు చిదంబరం వెళ్ళినపుడు, చెన్నకేశవులు అడగడు

"అయితేబాబూ! తమరికి వుద్యోగం సద్యోగం లేదుగదా? ఎట్లాఅయితే ఎందుకుతవరు ఏపనీ చేయలేదు? ఒంటి బతుకు బతుకుతున్నారేవిలా? అడగవచ్చా?"

"అడిగేస్తూ, అడగవచ్చా? అనడం బావుందండీ!" అని నవ్వాడు చిదంబరం

"నాకు వుద్యోగం, ఆఫీసూ లేకున్నా ఫర్వాలేదండీ! రచనలమీద ఆదాయం వస్తుంది! ఇకపోతే, ఒంటిబతుకు అంటారా? ఎందర్నో చూస్తుంటే, ఏంటో ఒంటే నా కిట్లా ఒంటగా జీవించడంలోనే సుఖం లభ్యమవుతున్నదన్పిస్తుంది! మీ సందేహాలకు సమాధానాలు దొరికాయికదూ?" అని నవ్వాడు.

చెన్నకేశవుల్ని అడగకుండానే, అతని కథ క్లుప్తంగా చెప్పాడు!

"మా అమ్మా, అయ్యాని నేను ఎరగనండీ! నాకు బాగా జ్ఞానం వచ్చేనాటికి ఎవరో ఒక అయ్యగారు నన్ను సాకుతున్నారని తెలిసింది!

ఆ అయ్యవారి పెంపకంలోనే నేను పదిహేనేళ్ళ వాడినయ్యేను! తర్వాతాయన గుండె ఆగి మరణించేరు! ఆయనదే బాబూ ఈ గుడి! అదిగో ఆనాటినించీ ఈనాటిదాకా యిదే నా ఆవాసం! ఆదాయం! అన్నీనూ" అని చెప్పాడు.

అయితే మీరేం చదివీవుండలేదాండీ?

"చదువా? నాకది వంటపట్టలేదుబాబూ! మా. అయ్యవారు ఆ ముచ్చటపడ్డారుగాని తీరలేదది!! ఆయన తనెలా ఈ గుడిమీద జీవనం కొనసాగించారో? నన్ను ఆవిధంగానే బ్రతకమంటూ మంత్రాలూ అవీ నేర్పారు! జనానికి దేవుడి మీదా, కర్మమీదా భక్తిప్రపత్తులమీదా నమ్మకం. గురీ వున్నంతకాలం మేమూ వుంటాం బాబూ!!" అంటూ యింత పులగం (పెసరన్నం) చేతిని పట్టమంటూ యిచ్చాడు చెన్నకేశవులు.



ఆ ప్రసాదం రుచి అద్భుతంగా అనిపించింది చిదంబరానికి. అది చెన్నకేశవులిచేతి మహాత్యమో? ఈశ్వరుడి మహాత్యమో అనుకున్నాడు
చిదంబరం వెళ్ళినపుడల్లా ఆ ప్రసాదం పట్టిడు యిచ్చేవాడు చెన్నకేశవులు.

"శివుడికిదే నేనెప్పుడూ వండీ నయివేద్యం చేస్తాను బాబూ!!" అని చెప్పాడు

చిదంబరం ఆ ప్రసాదం జ్ఞప్తికివచ్చి నాలికతో పెదిమల్ని తడుముకున్నాడు. మళ్ళీ ప్రసాదం కోసం అతని నోరూ, మనసూ వూరసాగింది రాడేమి అతనింకా? అని ఎదురుచూస్తుంటే –

అంతలో చెన్నకేశవులొచ్చాడు బయటనించీ!

"అర్రెర్రేర్రే! ఎందుకబ్బా అట్లాగోల?! కొనిచ్చేగదా, నువ్వడిగిందీ?!"

వులిక్కిపడి చూసాడటు చిదంబరం. వచ్చింది చెన్నకేశవులేనా? అనుకున్నాడు ఆహా! అతనే! అయితే మరి, అతని చేతుల్లో ఆ మూడేళ్ళ పాప ఎవరు?

చిదంబరం ఒకడుగు ముందుకి వేసాడు "ఏవండీ?" పిలిచాడు

చెన్నకేశవులు మొదట యిటుగా చూడలేదు. అతనిధ్యాసలో అతనున్నాడు

ఈ గుడిలోకి చిదంబరం వస్తూనే తలుపులుతీసే వుండడం చూసి "ఈ చెన్నకేశవులికి ఎంతగురి. మనుషులుమీద? గుడి తలుపులెప్పుడూ తీసేసే వుంచుతాడుగదా?" అని అనుకున్నాడు. పూజారి గది తలుపులూ తెరిచేవుంటయెప్పుడూ!

"అయినా ఏమున్నయ్‌లే? పోయేవి? రాతి లింగం, రాతి నంది? చెన్నకేశవులికిమాత్రం ఆ గదిలో ఖరీదయినవేమీ లేవుగద? అతని ఒంటి బ్రతుకు వస్తువుల కాశపడేంత కక్కుర్తి మనుషులుంటారా?" అని అనుకున్నాడు మళ్ళా.

చెన్నకేశవులికీ లోకంతో బంధాలు, అనుబంధాలూ, తనవాళ్ళూ. తనదంటూ విలువయిన వస్తువులూ ఏమీలేవు అనుకుంటూంటే –

ఇదేమిటి? ఈ పాప ఎవరితడి చేతులలో?!

అంతమోజేమిటతడి కా పాపపైన? గుడిలో ఎవరున్నారో కూడా చూడనంత?!! అని విస్తుపోయాడు చిదంబరం.

ఎవరో తెలిసిన వాళ్ళపిల్లయివుండొచ్చు! పిల్లలంటే, పువ్వులంటే ఎవరికి ప్రేమ కలగదు? అనుకుంటున్న చిదంబరం అటుగా చూసి విస్తుపోయాడు.

చెన్నకేశవులు పాపని తీస్కొని తన గదికి వెళ్ళాడు. వెడుతూ, "మీ రెప్పుడు వచ్చేరు, బాబుగారూ? ఇలారండి!" అన్నాడు మామ్మూలుగానే, చిదంబరం అతని గది వయిపు వెళ్ళాడు. పాప నేలమీద ఒకటికి పోసేస్తే, అలుగ్గుడ్డ తెచ్చీ అక్కడ తుడిచాడు చెన్నకేశవులు. "మీరు కాస్సే పుంటారు గదూ? నేను దీనికి బువ్వ తినిపించాలి! పాపం ఆకలవుతోంది వెర్రి నాన్నలుకి!" అన్నాడు చిదంబరంతో.

ఆత్రం పెరిగి పోతోంది చిదంబరంలో.

ఇతని కింత శ్రద్ధ ఏమిటీ పాప పైన?!! ఎవరి పాపో అయితే?!

ఏదో అడగబోయీ ఆగి పోయాడు.

ఒక చిన్న స్టీలు కంచంలో అన్నం మజ్జిగా కలుపుతున్నాడు, చెన్న కేశవులు!! మెత్తగా గుజ్జులా పిసికి, ఒక్కో ముద్దా పాప నోటిలో జాగ్రత్తగా పెడుతున్నాడతను! "తినమ్మా! అలా మారాం చెయ్యకూడదు, మరి! ఆఁ ఆఁ అమ్! ఆఁ అలా తినాలి!! ఏదీ? ఏదీ? ఒక్కటే ముద్ద! ఆఁ ఆఁ .. అమ్!! అద్దీ! మా మంచి పాప గదూ?"

"పేరేంటండీ పాప పేరు?" చిదంబరం అడిగాడు, నోరిప్పకుండా వుండలేక.

"దీని పేరా? చందమామ అనీ నేను పెట్టాను! ఎలా వుందీ?"



"చాలా బావుంది" అన్నాడు చిదంబరం. తను పేరు పెట్టాడా? అదేవిటి? అయితే ఇంకో పేరుందా? ఆ పేరెవరు పెట్టారు?!

"ఏవండీ?...." అంటూంటే,

"వస్తున్నా వస్తున్నా! ఒక్క నిమషం! దీన్ని పడుకో బెట్టి...." అంటూ, పక్క వేస్తున్నాడతను, మంచమ్మీద!!

సందేహాలతో చిదంబరం నుంచుండి పోయాడా గుళ్ళో.

నిశ్శబ్దం పూర్వం మాదిరిప్పుడు లేదక్కడ! పాప అల్లరితో గుడి ధ్వనించింది! పాప అవశిష్టంతో తడిసింది! పాప చేష్టలతో వాతావరణం స్తబ్ధతని, జడత్వాన్నీ కోల్పోయి, ఒక చిత్రమైన స్పందనతో నాదంతో నిండింది!! అది ఢమరుక నాదమా?!

తలో చిస్తూన్న చిదంబరం, "ఏవిరా? నువ్విక్కడ వుంటావని నాకు తెల్సురా! అందుకే వచ్చేను" అన్న మావయ్య గొంతుతో వులిక్కి పడ్డాడు.

"పద పద! చాలా సేపయింది. నీ కాకలవుతూందేమో? అన్నం పెట్టేస్తాను" అంటూ చెయి పట్టి తీసుకు పోయాడు అతను చిదంబరాన్ని.

భోజనం దగ్గర చిదంబరం తన సందేహాన్ని బైట పెట్టాడు! "మావయ్యా! మన చెన్నకేశవులి దగ్గర పాప ఎవరూ?"

సమాధానంగా మావయ్య నవ్వాడు. "నాకూ ఆ విషయం సరిగ్గా తెలీదురా! అడిగిన వాళ్ళకి చెన్నకేశవులు తన పాపే అని చెపుతున్నాడంతే! మరి ఆ పిల్ల తల్లి ఎవరో? ఎక్కడుందో? ఎప్పుడు ప్రవేశించిందో, అతని జీవితంలోకి?"

చిదంబరం సందేహం అలాగే వుండి పోయింది.

* * * * * * *

ఆకాశం దట్టంగా మబ్బుపట్టి, చల్లటి గాలి వస్తోంది ఒకటీ, ఒకటీగా మొదలెట్టిన చినుకులు క్రమ క్రమంగా అధికం అయ్యి, అలా వాన తీవ్రమైంది!

చిదంబరం తన గదిలోంచీ బయటికి వచ్చి, మేడ దిగాడు. మావయ్య ఇంట్లో లేడు. వుండి, వుండీ, ఎవరో వస్తే వాళ్ళతో గభాల్న వెళ్ళిపోతూంటాడు! చెప్పి వెళ్ళడం అనేదతని నిఘంటువులో లేదు.

ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. అత్తయ్య ఈ వారం అంతా కూడా రాదని మావయ్య తనతో చెప్పాడు అనుకున్నాడు చిదంబరం. భోజనం. నిద్ర రాత. చదువు రెండు దినాల నించీ చిదంబరానికి బోరుగా అనిపిస్తోంది. వాన వాన! ఇల్లు కదలనీయడం లేదు!!

అతనలా వరండా దాకా వెళ్ళాడు. అక్కడి నించీ కొంత మేర గుడి ఆవరణా కనిపిస్తూంటాయి.

గుడి ఆవరణలో చెన్నకేశవులి పాప తారట్లాడుతోంది! కాయితాలు పడవలు చేసి చెన్నకేశవులిస్తుంటే, అక్కడ చిన్న కాలువగా ప్రవహించే వాన నీటిలో పడవల్ని వదులుతూ, చప్పట్లు కొడుతోంది! పాప మరి కొంచెం ముందుకు వెళ్ళి, మరుక్షణం కాలు జారి దభాల్మంటూ పడిపోయింది నీట్లో!

ఈ వేమన పద్యాలు

వల్లవైపు లేక వాగ్దత్తములు చేసి
యదిగో ఇదిగో యన చు నాశబెట్టి
గడువుబెట్టి రేపు గడియగానిమ్మని
గడియలోనబడియె గదర వేమ.

ప్రసాదం

గట్టిగా పాప ఏడుస్తోంది! చెన్నకేశవు లామె నెత్తుకుని, ఓదార్చుతూ, లోపలికి తీసుకు వెళ్ళాడు.

ఆ దృశ్యం కనుమరు గయితే, చిదంబరం వూపిరి విడిచాడు, బరువుగా. వాన తగ్గితే బావుండు నన్నుకున్నాడు. వానలో తడవడం అతనికి చాలా చికాకు.

ఆ రోజంతా కూడా వానలా పడుతోనే వుంది!

మావయ్య రెండు పూటలకి ఒకేసారి వంట చేసి, ఫ్రిజ్‌లో పెట్టేసి వుంచుతున్నాడు! తినే సమయానికి గాస్ పొయ్యి మీద వేడి చేస్కోడమే!

చిదంబరం ఇల్లంతా అలంగం తిరిగాడా రోజంతా.

ఆ రాత్రి పదకొండు గంటలకి మావయ్యని వాళ్ళ కారులో తెచ్చి దిగబెట్టారు తీసుకుని వెళ్ళిన వాళ్ళు.

ఆ మర్నాడు వాన తగ్గిపోయింది! ఆకాశం నిర్మలంగా మారింది! ఎండ కూడా వస్తే, చిదంబరం ఆనందించా డెంతో. "ఏరా? మీ అమ్మకి, నాన్నకి, అన్నయ్యకీ వుత్తరం రాశావా?" అడిగాడు మావయ్య.

"వచ్చిన మర్నాడే రాసేను!" ,అని చెప్పాడు చిదంబరం.

అతనా రోజు సమయం చూస్కుని, గుడిలో కెళ్ళాడు.

చెన్న కేశవుల్ని చూసి నిశ్చేష్ట డయ్యాడు చెన్న కేశవులి మొహం ఎంతో నీరసంగా, వాడిపోయీ, కళతప్పి, పది లంఖణాలు చేసినట్లు వున్నది!!

"పాప కెలా వుంది?" అడిగాడు చిదంబరం

"మీ కెట్లా తెలుసూ?"

"నీళ్ళలో జారి పడిపోవడం చూశాను మా ఇంట్లోంచి!"

"దెబ్బ చిన్నదే గానీ, జ్వరం బాగా వచ్చేసింది! మందు వేస్తున్నాను!" అంటూ పాపని చూపించా డతను

"మీరు భోజనం మానివేశా రేమిటి? అట్లా అయిపోయారు?!"

అతనదోలా నవ్వాడు "నాకు తిండి సహించడం లేదు! నిద్ర పోవడం లేదు! అదేం అయిపోతుందోనని బెంగగా వుంది!" దిగాలుగా చెప్పాడు.

చిదంబరం వెళ్ళి ఒక రిక్షా తీసుకు వచ్చాడు. అందులో చెన్నకేశవులు, పాప నెత్తుకు కూచుంటే, తను పక్క నుండీ, ఒక డిస్పెన్సరీకి తీసుకు వెళ్ళాడు. తిరిగి వాళ్ళు గుడిలోకి వెళ్ళాక, తీసుకు వచ్చిన మాత్రలు పాపకి వేసాక, అప్పటికి చెన్నకేశవులి ముఖం కొద్దిగా వికసించింది! అతను నింపాదిగా, చిదంబరంతో ఇలా చెప్పాడు.

"పాప తల్లి పవిత్రమైన బాధ్యత నా కప్పగించి పోయిందండీ!! ఆమె చాలా హీనమైన పరిస్థితిలో మరణించింది! ఆఖరి క్షణాలలో కూడా ఆమెకి అన్నం కరువై పోయిందంటే, నమ్ముతారా, మీరూ? ఈ ప్రక్క వూరే వారిది! భర్త బాధ్యత లేకుండా ఆమెనీ, పిల్లని వాళ్ళ ఖర్మానికి విడిచి ఎటో వెళ్ళిపోతే, ఆవిడ నానా తిప్పలూ పడింది!! ఆవిడకి చదువు లేదు. సంపాదన చేసే ఏ పనీ చేత కాదు! అలా అని పాచి పనీ అలాటివి చేయడానికి మానాభిమానా లొప్పలేదు!! అబద్దాలాడీ, ఈ అమ్మాయిని ఒక కుటుంబంలోంచీ లాగాడు ఆ రాస్కెలు!! కట్నమూ, ఆమె ఒంటి మీద వస్తువులూ, అన్నీ హరించి పారి పోయాడు!!! ఆమె తాలూకు వాళ్ళు ఒక అన్నా, వదినె మాత్రమే!! వాళ్ళు మరి చేరదీయరని ఆమెకి తెలుసు! ఆ పరిస్థితిలో.... నేనా చోటికి, ఒక పని మీద, అంటే, ఆమె వుంటోన్న పక్కింటిలో రెండు దినాలు భారీ ఎత్తున నోము జరిగి ఆహ్వానిస్తే, అది జరిపించే నిమిత్తము వెళ్ళాను!! పనయ్యేకా, పక్కనే ఆ దుస్థితి నా గుండెని చెరువు చేస్తే వెళ్ళీ, స్వాంతన పలకబోయీ, ఆవిడ నాతో తన గోడంతా చెప్పుకునీ నా చేతుల్లో ఈ పిల్లనుంచితే, ఏం చేస్తానండీ? చెప్పండి??" అగా డతను ఆయాసం తీర్చుకున్నాడు.

"ఆవిడ నా కప్పగించిన ఈ బాధ్యతని ప్రసాదంలా స్వీకరించే నండీ!! ఈ విషయం అందరికీ నేను ఎందుకు చెప్పాలీ? మీ మీదయితే నా కున్న ఒక మంచి భావం వలన ఇదంతా ఇప్పుడు చెప్పాను!!" అన్నాడు నిట్టూర్చుతూ.

చిదంబరానికి తన ప్రసాదం గుర్తు వచ్చి, అడగబోయీ, అది సమయం కాదని వూరుకున్నాడు

పాప చెన్నకేశవులి చేతుల్లో నిబ్బరంగా నిద్ర పోతున్నది! □